# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ప్రభావంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహిస్తున్నారు.**

2. **వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ ఆధికారులు సంసిద్ధంగా ఉండాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**

3. **రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.**

4. **కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో రాష్ట్రంలోని పంచారామాలు, శ్రీశైలంతో పాటు ఇతర శైవక్షేత్రాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు.**

3. **భారత సైన్యంలో పదాతిదళం సేవలకు గుర్తుగా ఈరోజు పదాతి దళ దినోత్సవం జరుపుకుంటున్నారు.**

==========================

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను రేపు ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశముందని అమరావతి వాతావరణం కేంద్రం వెల్లడించింది. తుపాను ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ మచిలీపట్నం- కళింగపట్నంల మధ్య తీరం దాటే అవకాశముందని, ఈ సమయంలో ఈదురుగాలులు 90 నుంచి 100 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి తెలియజేస్తూ..

..వాయిస్ ... 30 సెకన్లు

--------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ప్రభావంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో తుపాను సన్నద్ధత అధికారులు తీసుకుంటున్న చర్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. తుపాను తీరం దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులను పలు సూచనలు చేశారు. అలాగే మధ్యాహ్నం రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులు, రియల్ టైమ్ గవర్నెన్స్ ఆర్టీజీఎస్‌పై సమీక్ష నిర్వహిస్తారు.

--------------------------

మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లాల వరకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్, రాయలసీమ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మత్స్యకారులు ఐదు రోజుల పాటు చేపల వేటకు వెళ్లరాదని అన్ని పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలను అధికారులు జారీ చేశారని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలియజేస్తూ...

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

మొంథా తుపాను నేపథ్యంలో పలు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వేతర జూనియర్ కళాశాలలకు సెలవులు ప్రకటించారు. అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని కళాశాలలకు ఈరోజు నుంచి 29 వరకు, పల్నాడు, పశ్చిమగోదావరి, ఏలూరు, బాపట్ల, వైఎస్సార్ కడప జిల్లాలకు ఈరోజు, రేపు, కాకినాడ జిల్లాకు ఈరోజు నుంచి 31వ తేదీ వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది.

---------------------------

మొంథా తుపాను నేపథ్యంలో అమరావతి నుంచి రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో పురపాలక మంత్రి పి.నారాయణ దృశ్య మాధ్యమ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అన్ని నగరపాలక, పురపాలక సంస్థల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస శిబిరాల సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు అందించాలని ఆదేశించారు.

అలాగే రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ ఆధికారులు సంసిద్ధంగా ఉండాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరులో ఈరోజు ఆయన మాట్లాడుతూ,

వాయిస్... 29 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనుముసముద్రంపేట మండలం ఎడవల్లి గ్రామంలో కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న శ్రీ కోదండ రామాలయానికి భూమి పూజతో పాటూ, పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి నిన్న ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల పునర్నిర్మాణ పనులకు కోట్లాది రూపాయల నిధులను కేటాయించామని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం –టిటిడికి చెందిన శ్రీవాణి నిధులతో గ్రామాల్లో నూతన ఆలయాల నిర్మాణాలను చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు.

---------------------------

కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో రాష్ట్రంలోని పంచారామాలు, శ్రీశైలంతో పాటు ఇతర శైవక్షేత్రాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. వేకువజామునుంచే ఆలయాలకు భక్తులు బారులు తీరారు. భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. కృష్ణా, గోదావరి స్నాన ఘట్టాల్లో కార్తీకమాస

స్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కార్తీక మాస మొదటి సోమవారం పురస్కరించుకుని శ్రీశైలంలో ఆలయ పుష్కరిణి వద్ద ఈరోజు సాయంత్రం లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

---------------------------

స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఉత్తేజపరిచిన ఒక ముఖ్యమైన గీతం వందేమాతరం ప్రసిద్ధి పొందింది. బంకిం చంద్ర చటోపాధ్యాయ రచించిన ఈ పాట 1875లో బెంగాలీ నవల 'ఆనందమఠం'లో తొలుత ప్రచురితమైంది. 1896లో గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగూర్ మొదటిసారిగా ఈ గీతాన్ని ఆలపించారు. స్వరాజ్య సంగ్రామంలో భారతదేశ ప్రజలను ఏకం చేయడానికి, మాతృభూమికి ప్రాతినిధ్యం వహించే జాతీయవాద భావనను పెంపొందించడానికి ఈ గీతం చిహ్నంగా నిలిచింది. 1950లో భారత రాజ్యాంగ సభ ఈ గీతంలోని తొలి రెండు చరణాలను జనగణమనతో సమానమైన హోదాతో భారత జాతీయ గీతంగా ఆమోదించింది. నవంబర్ ఏడవ తేదీన వందేమాతరం 150వ సంవత్సరాన్ని పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో ఆ గీతంలోని కొంత భాగాన్ని ఇప్పుడు విందాం.

వాయిస్ 30 సెకన్లు

---------------------------

భారత సైన్యంలో భాగమైన పదాతిదళం దేశానికి అందించిన సేవలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబరు 27వ తేదీన పదాతి దళ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దేశ చరిత్రలో అక్టోబర్ 27వ తేదీకి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. 1947 అక్టోబర్ 27వ తేదీన భారత సైన్యంలోని పదాతి దళం శ్రీనగర్‌కు చేరుకుని నగర శివార్ల నుంచి ధైర్య సాహసాలతో ఆక్రమణదారులను తరిమి కొట్టింది. పాకిస్తాన్ మద్దతుతో జమ్మూకాశ్మీర్ రాష్ట్రాన్ని ఆక్రమించడానికి జరిగిన దాడిని పదాతి దళం తిప్పి కొట్టి జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రక్షించింది. దేశ సార్వభౌమాధికారం భద్రతను పరిరక్షించడంలో పదాతిదళం పోషించిన ముఖ్యమైన పాత్రను తెలియజేయడమే పదాతిదళ దినోత్సవ నిర్వాహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా అనంతపురంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధాల ప్రదర్శన –ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు.

======================